ప్రజాశక్తి

బుధవారం 11 జూన్, 2025

5

శ్రీకాకుళం

ఘనంగా సిరిమానోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పాతశ్రీకాకుళంలో కనుల పండగగా సిరిమానోత్సవం మంగళవారం నిర్వహించారు. పెద్దమ్మ తల్లి, నూకాలమ్మ తల్లిలను పూజించారు. ఈ సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టారు. సిరిమానోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొవడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసింది. ఈ పండగ బుధవారం సైతం కొనసాగనుంది.

సిరిమానోత్సవంలో పాల్గొన్న యాత్రికులు

ప్రైవేట్‌లో ఫీజుల దందా

- అడ్డగోలుగా వసూళ్లు
- ఇష్టారీతిన రుసుముల నిర్ణయం
- నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, నోటుబుక్స్ విక్రయాలు
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ

పాఠశాలలు ఈ నెల 12వ తేదీన పున:ప్రారంభం కానుండడంతో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలకు దోపిడీ పర్వానికి తెరతీశాయి. ఫీజులు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నాయి. పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్ ధరలనూ పెంచి తమ గల్లా పెట్టెను నింపుకుంటున్నాయి. పుస్తకాలు, యూనిఫాం విక్రయించకూడదని నిబంధనలు చెప్తున్నా.. బేఖాతరు చేస్తున్నాయి. ఫీజుల వసూళ్లపై నియంత్రణ లేకపోవడంతో, ప్రైవేట్ యాజమాన్యాలు అడ్డగోలుగా దోపిడీ సాగిస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు వసూళ్లు చేస్తున్న సొమ్ములు భారీగా ఉండటంతో పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు నలిగిపోతున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ మాత్రం చోద్యం చూస్తోంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3053 ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 1955, ప్రాథమికోన్నత 269, ఉన్నత పాఠశాలలు 414 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 2,655 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 1916, ప్రాథమికోన్నత 332, ఉన్నత పాఠశాలలు 407 ఉన్నాయి. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు 398 ఉన్నాయి. వాటిలో ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ 394 , సిబిఎస్ఇ సిలబస్‌తో నడుస్తున్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాలుగు ఉన్నాయి. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి మొత్తం 2,90,859 చదువుతున్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో 2,01,993 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 88,866 మంది విద్యనభ్యసిస్తున్నారు

భారీగా ఫీజులు వసూలు

విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల దోపిడికి తెరలేపాయి. పరీక్షల్లో ఫలితాలు, స్కూళ్ల స్ట్రెంత్, పేరెంట్స్ మోజు బట్టి యాజమాన్యాలు ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఫీజులు కొంత వరకు అందుబాటులో ఉన్నా పట్టణ, నగర పరిధిలోని స్కూళ్లలో మాత్రం భారీగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ స్కూళ్లలో ఎల్‌కెజి విద్యార్థికి గరిష్ఠంగా రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. అయితే కార్పొరేట్ స్కూళ్లు మాత్రం రూ.20 వేలు వరకు వసూలు చేస్తున్నాయి. పలాస, టెక్కలి, ఆమదాలవలస వంటి ప్రాంతాల్లో ఎల్‌కెజి విద్యార్థికి రూ.15 వేలు వరకు తీసుకుంటున్నారు. శ్రీకాకుళం నగరంలో మాత్రం భారీగా ఫీజులు ఉన్నాయి. ఎల్‌కెజి విద్యార్థికి ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న వారి నుంచి బస్సు ఛార్జీల రూపంలో వేల రూపాయాలను తీసుకుంటున్నారు.

పదో తరగతి ఫలితాలే ప్రామాణికం

ఫీజుల వసూలుకు పదో తరగతి ఫలితాలనే ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 590కు మించి మార్కులు సాధిస్తే మరి వెనుదిరగడం లేదు. తల్లిదండ్రుల్లో విపరీతమైన క్రేజ్ రావడంతో యాజమాన్యాలు డబ్బులు వసూలు చేస్తున్నాయి. అప్పటివరకు వసూలు చేస్తున్న ఫీజులపై 30 నుంచి 40 శాతం పెంచేస్తున్నాయి. చిన్న చిన్న పట్టణాల్లో ఉన్న సాధారణ ప్రైవేట్ స్కూళ్లు సైతం భారీగా ఫీజులను పెంచి వసూలు చేస్తున్నాయి.

పుస్తకాల ధరలనూ పెంచేశారు

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో వారి చెప్పిందే ధరగా ఉంటోంది. ఈ ఏడాది 30 నుంచి 40 శాతం వరకు పుస్తకాల ధరలను పెంచేశారు. ప్రభుత్వ పుస్తకాలు మినహా వారి సిలబస్‌కు సంబంధించిన పుస్తకాలు, నోట్‌బుక్స్ తమ స్కూళ్లలో కొనాల్సిందేనని యాజమాన్యాలు హుకుంజారీ చేస్తున్నాయి. దీంతో బయట మార్కెట్‌తో పోలిస్తే ప్రైవేట్ స్కూళ్లలో ధరలు ఎక్కువగా ఉన్నా తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే కొంటున్నారు. శ్రీకాకుళం నగరంలోని అఫీషియల్ కాలనీలో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో గత సంవత్సరం ఐదో తరగతి పుస్తకాలకు రూ.3,500 వసూలు చేయగా, ఈ ఏడాది రూ.4,200 తీసుకుంటున్నారు. నోట్ పుస్తకాల ధరలనూ పెంచేశారు. బయట మార్కెట్‌లో రూ.25 ధర ఉండే నోట్ పుస్తకాన్ని రూ.36 తీసుకుంటున్నారు.

జూన్ వచ్చిందంటే తల్లిదండ్రుల్లో టెన్షన్

స్కూళ్లు తెరుస్తున్నారంటే చాలు తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలవుతుంది. పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలని, తాము సరిగా చదువుకోలేకపోయినా వారిని బాగా చదించాలని కోరుకుంటున్న తల్లిదండ్రులు నలుగురితో పాటు వారి పిల్లలనూ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదివిస్తున్నారు. ముఖ్యంగా చిరు ఉద్యోగులు, ప్రైవేట్ ఎంప్లాయిస్ తమ జూన్ నెల జీతమంతా వెచ్చించినా చాలకపోవడంతో అప్పు చేసి మరీ ఫీజులు కడుతున్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

గోల్డెన్ అవర్ అత్యంత కీలకం

- డిజిటల్ అరెస్టులపై అప్రమత్తంగా ఉండాలి
- అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సైబర్ నేరం, మోసం జరిగినప్పుడు నేరం జరిగిన మొదటి గంట (గోల్డెన్ అవర్) చాలా కీలకమని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. బాధితులు పోగొట్టుకున్న నగదును రికవరీ చేయడానికి మొదటి గంట చాలా ముఖ్యమైనదన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరం సమయంలో గోల్డెన్ అవర్‌లో 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేసి బ్యాంక్ అకౌంట్, వ్యక్తిగత వివరాలు తెలియజేస్తే కొంతమేరకు పోగొట్టుకున్న నగదును సైబర్ నేరగాల నుంచి రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని సైబర్ కేసులు నమోదయ్యాయని, ఆయా కేసుల్లో సుమారు రూ.7 కోట్ల మేరకు నగదు బాధితుల నుంచి సైబర్ నేరగాళ్లు తస్కరించారని వివరించారు. ఆయా ఫిర్యాదుల మేరకు రూ.రెండున్నర కోట్ల వరకు నగదును ఫ్రీజ్ చేశామన్నారు. ఇప్పటికీ జిల్లాలో పలు కేసుల్లో రూ.60 లక్షల నగదును కోర్టు ద్వారా బాధితులకు అందజేసినట్లు తెలిపారు. విజయవాడ తర్వాత శ్రీకాకుళం జిల్లాలోనే ఈతరహాలో న్యాయస్థానం ద్వారా నగదును బాధితులకు అందజేసినట్లు చెప్పారు. డిజిటల్ అరెస్టులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్ అరెస్టులను ప్రజలు నమ్మొద్దని కోరారు. అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

జిల్లాలో రూ.80 లక్షల విలువైన రికవరీ చేసిన 505 మొబైల్ ఫోన్లను బాధితులకు ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి మంగళవారం అందజేశారు. ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు ఆలస్యం లేకుండా బ్లాకింగ్ అభ్యర్థన ద్వారా రిజిస్టర్ చేసుకుంటే మొబైల్‌ను ట్రాక్ చేసి, రికవరీ చేసిన తర్వాత మొబైల్‌ను అన్ బ్లాక్ చేసి పోగొట్టుకున్న వ్యక్తికి ఇస్తున్నామని తెలిపారు. జిల్లాలో గత నాలుగు నెలల కాల వ్యవధిలో సుమారు 505 ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఇప్పటికే తొమ్మిది దశలుగా రికవరీ చేసిన ఫోన్లను భాదితులకు అందజేసినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లు వాడే ప్రతిఒక్కరూ ఫోన్‌లో సెక్యూరిటీ లాక్ వేసుకోవాలని సూచించారు. అదనపు ఎస్‌పి కెవి రమణ పర్యవేక్షణలో ఫోన్లు ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సైబర్, ఐటి సెల్ సిఐ టి.శ్రీను, సిఐ సిసిఎస్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. సమావేశంలో సిఐ ఇమాన్యుల్ రాజు, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస్, సైబర్ సెల్ ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న వైసిపి నాయకులు

మహిళలకు భద్రత కరువు

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం సిటీ: రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వంలో మహిళకు భద్రత కరువైందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు, దాడులు, అత్యాచారాలను నిరసిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యాన నగరంలోని పాతబస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం మౌన ప్రదర్శన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు పట్టుకొని మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయన్నారు. పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమైందని, వ్యక్తిగత, రాజకీయ కక్షలకు పోలీసులను వాడుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్, మహిళా నాయకులు ఎ.వి పద్మావతి, కామేశ్వరి, సుగుణారెడ్డి, మూకళ్ల సుగుణ, చల్లా అలివేలుమంగ, మానస తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పలుచోట్ల వర్షాలు

శ్రీకాకుళంలో గరిష్ఠంగా 42.75 మి.మీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళశారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో సగటున 14.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శ్రీకాకుళం నగరంలో అత్యధికంగా 42.75 మి.మీ వర్షపాతం నమోదైంది. గార మండలం కళింగపట్నంలో 34 మి.మీ, రణస్థలం మండలం పైడిభీమవరంలో 29.5 మి.మీ వర్షం కురిసింది. లావేరు మండలం తామాడలో 23.5 మి.మీ, ఎచ్చెర్లలో 234 మి.మీ వర్షం కురిసింది. లావేరులో 18.75 మి.మీ, రణస్థలం మండలం గరికిపాలెంలో 13.75 మి.మీ, పోలాకిలో 12.25 మి.మీ, ఆమదాలవలసలో 11.25 మి.మీ వర్షం కురిసింది. శ్రీకాకుళం నగరం, మండలంలో అర్ధరాత్రి తర్వాత నుంచి చిరుజల్లులు కురిశాయి. ఉదయం 7.30 గంటల నుంచి పది గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. పొట్టి శ్రీరాములు కూడలి, మండల వీధి కూడలి, మార్కెట్‌లోని మేదరవీధి ప్రాంతం, కృష్ణాపార్కు, దీపామహల్, లక్ష్మీ థియేటర్ ప్రాంతాల్లో కాలువలు పొంగిపొర్లాయి. రోడ్ల పైకి భారీగా వర్షపు నీరు చేరింది. కొద్దిపాటి వర్షానికే చెరువును తలపించే శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ భారీ వర్షానికి జలమయమైంది. బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. మురుగునీటిలోనే రాకపోకలు సాగించారు.

శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో చేరిన వర్షపునీరు

ఆడబిడ్డలకు రక్షణ కల్పించాలి

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- పాతపట్నం

ఆంధ్రప్రదేశ్‌లో ఆడబిడ్డలకు రక్షణ కరువైందని, గతేడాది కాలంగా ఇది స్పష్టంగా రుజువవుతూనే ఉందని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఏకంగా 188 మందికి పైగా ఆడబిడ్డలపై అఘాయిత్యాలు జరిగాయన్నారు. ఈ దారుణ సంఘటనలు రాష్ట్రంలో మహిళల భద్రతకు ఏపాటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందో స్పష్టం చేస్తున్నాయని అన్నారు. మరో వైపు అసాంఘిక శక్తులు మహిళలపై, బాలికలపై విచ్చలవిడిగా అత్యాచారాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుదన్నారు. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, మహిళా సంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడుతుందని హెచ్చరించారు.

వెనుదిరుగుతున్న విద్యార్థులు

జాప్యంతో పరీక్షకు దూరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎపి పిజి సెట్ పరీక్షలు అన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మాడు షిఫ్టుల్లో పరీక్షలు మంగళవారం నిర్వహించారు. మొదటి షిఫ్టు 9 గంటల నుంచి 10.30 గంటలు వరకు నిర్వహించారు. ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో మొదటి షిఫ్టుకు సకాలంలో పలువురు విద్యార్థులు హాజరు కాలేకపోయారు. పది నిమిషాలు ఆలస్యం కావడంతో నిర్వాహకులు అనుమతించలేదు. దీంతో 63 మంది విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు. పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యకు దూరం కావటంతో నిరాశతో విద్యార్థులు వెనుదిరిగారు. మొదటి షిఫ్టులో 257 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 194 మంది మాత్రమే హాజరయ్యారు. రెండో షిఫ్టులో 202 మందికి 174 మంది పరీక్ష రాశారు. మూడో షిఫ్టులో 246 మందికి 212 మంది పరీక్ష రాశారు.

ముమ్మరంగా విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ తనిఖీలు చేస్తోంది. క్రీడల నిర్వహణ ఖర్చు, క్రీడాకారులకు అందజేసిన బహుమతులు వంటి వాటిపై తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలోని 30 మండలాలు యూనిట్‌గా విచారణ సాగుతోంది. ఎచ్చెర్ల, రణస్థలంతో పాటు పలు మండలాల్లో మండల పరిషత్ కార్యాలయంలో క్రీడల నిర్వహణలో ఇన్‌ఛార్జీలుగా వ్యవహరించిన అధికారులను విజిలెన్స్ అధికారులు మంగళవారం విచారణ చేశారు. బహుమతులు పొందిన క్రీడాకారుల వద్దకు వెళ్లి అప్పట్లో అందజేసిన బహుమతులు పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం మండలాల్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

యోగాసనాలతో వ్యాధులు దూరం

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - గార

యోగాసనాలతో వ్యాధులు దూరమవుతాయని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. యోగాంధ్రలో భాగంగా మంగళవారం కళింగపట్నం బీచ్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాసనాలను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. యోగా వల్ల మనసు ప్రశాంతంగా, నెమ్మదిగా ఉంటుందన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14న రెండు వేల మందితో ఆర్ట్స్ కళాశాల మైదానంలో మాక్ యోగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి పి.జగదీష్, డిపిఒ కె.భారతీ సౌజన్య, డ్వామా పీడీ సుధాకరరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ మేరీకేథరిన్, తహశీల్దార్ ఎం.చక్రవర్తి, సర్పంచ్ బి.లలిత, కళింగపట్నం ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న అధికారులు

పిజి నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పోస్టుగ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్ ఉదయ్‌భాస్కర్ మంగళవారం విడుదల చేశారు. సబ్జెక్టు వారీ ఫలితాలు ఇలా ఉన్నాయి. జర్నలిజం అండ్ మాస్‌కమ్యూనికేషన్‌లో ముగ్గురు, ఎకనామిక్స్‌లో తొమ్మిది మంది, ఇంగ్లీష్‌లో 19 మంది, రూరల్ డెవలప్‌మెంట్‌లో ఐదుగురు, తెలుగులో తొమ్మిది మంది, ఎంబిఎలో 37 మంది, ఎంకాంలో ఏడుగురు, ఎంఇడిలో 32 మంది, ఎంఎల్ఐఎస్ఇలో 15 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎనలిటికల్ కెమిస్ట్రీలో 41 మందికి 39 మంది, బయోటెక్నాలజీలో 23 మంది, ఫిజిక్స్‌లో 12 మందికి 11, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 185 మందికి 150 మంది, గణితంలో 14 మంది, జువాలజీలో ఏడుగురు, మైక్రోబయాలజీలో 20 మంది, కంప్యూటర్ సైన్స్‌లో 22 మం దికి 18 మంది, అప్లైడ్ గణితంలో 8 మంది ఉత్తీర్ణత సాధించారు. 15 రోజుల్లోపు రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

అంతర్రాష్ట్ర సరిహద్దులో నాటుసారాపై దాడులు

ప్రజాశక్తి - పాతపట్నం

ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో నాటుసారా తయారీ, విక్రయాలపై ఇరు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు మంగళవారం సంయుక్తంగా దాడులు చేపట్టారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రారావు, ఎక్సైజ్ అధికారి సిహెచ్. తిరుపతి నాయుడు ఒడిశా రాష్ట్ర గంజాం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు దాడులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మెళియాపుట్టి, కొత్తూరు మండలాల పరిధిలో, ఒడిశాలోని సింగిపూర్‌లో దాడులు చేశారు. ఈ దాడుల్లో 2,600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 200 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసులు నమోదు చేసినట్లు పాతపట్నం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కె.కృష్ణారావు తెలిపారు.

తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లకు దరఖాస్తులు

శ్రీకాకుళం పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం, శ్రీకాకుళం (పెద్దపాడు)లో పలు తరగతుల్లో ఖాళీలను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బి.లవకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఈనెల 16. అడ్మిషన్ కోరుకునే వారు ఈనెల 16వ తేదీ లోపు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల మధ్య పాఠశాలను నేరుగా సంప్రదించవచ్చు. అందుబాటులో ఉన్న ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి : 4వ తరగతిలో కేవలం ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తారు. 8, 9, 11వ తరగతుల్లో అందరికీ అవకాశం ఉంది. 10, 12వ తరగతులకు కేటగిరీ 1, 2 అభ్యర్థులకు మాత్రమే (సిబిఎస్ఇ అఫిలియేటెడ్ పాఠశాలలో చదివిన విద్యార్థులకు) ప్రవేశం ఉంటుంది. మరింత సమాచారం కోసం, పాఠశాల అధికారిక మెయిల్ kvsrikakulam@gmail.com ద్వారా లేదా నేరుగా గానీ పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

పాస్ పోర్ట్ పోయినది

నేను **పెద్దింటి లోకనాథం** S/o పెద్దింటి దండాసి, ఇంటి నంబరు 8-2-375, రామాలయం వీధి , కొత్తూరు గ్రామం, బారువ పోస్ట్, సోంపేట మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ 532263.

నా యొక్క పాస్ పోర్ట్ నంబరు **C2770671** కొత్తూరు నుంచి బారువకి జిరాక్స్ కోసం బైక్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో నా పాస్ పోర్ట్ పోయినది. ఎవరికైనా దొరికిన యెడల బారువ పోలీస్ స్టేషన్ లో గాని ఈ కింది ఫోన్ నెంబరు కి గానీ తెలియ చేయగలరు.

ఫోన్ నంబరు: 7093395747

పద్మనాభంను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

కష్టపడే వారికి గుర్తింపు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
టిడిపి అభివృద్ధికి, బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేస్తే తప్పక పార్టీ గుర్తింపు ఉంటుందనడానికి ఉదాహరణ తను అని టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం అన్నారు. మంగళవారం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ క్యాంపు కార్యాలయంలో నూతన కార్యవర్గం మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనారిటీకి చెందిన తనకు మండల పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు సిఎం నారా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు, విప్ అశోక్‌కు ధన్యవాదాలు తెలిపారు. టిడిపి ఆవిర్భావ నుంచి పార్టీలో అనేక పదవులు చేపట్టినా మొదటిసారిగా మండల బాధ్యతలు తనకి అప్పగించినందుకు కేడర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో టిడిపి మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు అందరితో కలిసి తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దక్కత ఢిల్లీరావు, సాడి సహదేవ్‌రెడ్డి, మెరుగు సూర్యనారాయణ రెడ్డి, పెద్దిన బాబ్జీ, దక్కత రామారావు, లోహిదాసు, బాలరాజు, దుపాన సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవిటి : విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రాయితీపై వరి విత్తనాలు

ప్రజాశక్తి- కవిటి
ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి పిరియా శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు ముందస్తు ప్రణాళికతో రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన విత్తనాలను సిద్ధంగా ఉంచామన్నారు. మంగళవారం బెలగాం రైతు సేవా కేంద్రంలో రైతులకు రాయితీ విత్తనాలను కూటమి నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలో సుమారు 600 క్వింటాళ్ల విత్తనాలు రైతుల కోసం అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మణిచంద్రప్రకాష్, బాసుదేవ్ రౌళో, సంతోష్ పట్నాయక్, శ్రీనివాస్ రౌళో, మద్దిలి ఈశ్వరరావు పాల్గొన్నారు.
ఇచ్ఛాపురం: మండలంలోని బెల్లుపడలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లీలారాణి, నీటి సంఘం అధ్యక్షుడు కోచర్ల ధనుంజయ్, వ్యవసాయ సహాయకులు మల్లేశ్వరరావు, రెయ్య జానికిరావు, నందిగాం కోటి, ధర్మ, రమ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై మహిళల నిరసన

పాతపట్నం : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ప్రజాశక్తి- పాతపట్నం
అమరావతి మహిళలపై జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ మంగళవారం మహిళలు ఆందోళన చేపట్టారు. టిడిపి కార్యాలయం నుంచి ఆల్ ఆంధ్రా రోడ్డు వరకు 1200 మంది మహిళలతో భారీ ర్యాలీతో రోడ్డెక్కారు. కృష్ణంరాజుని అరెస్టు చేయాలి, సాక్షి ఛానల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నినదిస్తూ ఆందోళనలతో కదం తొక్కారు. మహిళల మనోభావాలు కాపాడాలంటూ మానవహారంతో నిరసన తెలియజేశారు. అలాగే తప్పుడు రాతలు రాసిన సాక్షి పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి మహిళలు, తదితరులు పాల్గొన్నారు.
పొందూరు: అమరావతి వేశ్యల రాజధాని అంటూ సాక్షి ఛానెల్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన అనాలిస్ట్ ముసుగులో ఉన్న జర్నలిస్టు కృష్ణంరాజు, యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు నిరసన తెలిపారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసులకు, తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలను అందజేశారు.
పలాస : అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కెఎస్ఆర్, కృష్ణరాజులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సాక్షి పత్రిక, ఛానల్‌ను బ్యాన్ చేయాలని కోరుతూ టిడిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాశీబుగ్గ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకరుప్త, బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, దువ్వాడ శ్రీకాంత్, ఎం.నరేంద్ర, ఎ.రామకృష్ణ, కొత్త సత్యం, సూరాడ మోహనరావు, రట్టి లింగరాజు పాల్గొన్నారు.
ఆమదాలవలస : రాజధాని మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకు సాక్షి ఛానెల్‌ను నిషేదించాలని జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత డిమాండ్ చేశారు. పట్టణంలోని గాంధీ విగ్రహం నుంచి పోలీస్ స్టేషన్ వరకు మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ బాలరాజుకు, డిటిలకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు కణితి విజయలక్ష్మిభాయ్, బోయిన సునీత, గుడ్ల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పొందూరు : నిరసన తెలుపుతున్న మహిళలు

ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

నూతన వంగడాలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- ఆమదాలవలస
నూతన వంగడాలతో వరిలో అధిక దిగుబడిని సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. పురపాలక సంఘంలోని నాలుగో వార్డు గేదెలవానిపేటలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి మాట్లాడుతూ తొలకరిలో వరి పంటలో వచ్చే చీడపీడల యాజమాన్యాన్ని గురించి పలు సూచనలు చేశారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి వాణిజ్య పంటల పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త అనిందిత పాల్ మాట్లాడుతూ వ్యవసాయంలో హానికారక రసాయనక మందుల వాడకాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల యాజమాన్యం చేయాలని రైతులను కోరారు. జాతీయ వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ చౌడు ప్రాంతాలకు అనువైన వరి రకాలు వాటి యాజమాన్య పద్ధతులు, మట్టి పరీక్షల ఉపయోగాలు గురించి తెలియజేశారు అభ్యుదయ రైతు బి.వి.రమణమూర్తి మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రీకరణ వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని, వరిలో విత్తనోత్పత్తి చేయడం ద్వారా రైతులు మంచి నికర ఆదాయాన్ని పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో రైతులు సాధు సుందర్రావు, సాధు మధుసూదనరావు, సాధు రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శాస్త్రవేత్త కిరణ్ కుమార్

విత్తన ఎంపికతో అధిక దిగుబడులు

సరుబుజ్జిలి : ఖరీఫ్‌లో విత్తన ఎంపికతో అధిక దిగుబడులు సాధించవచ్చునని రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మధుకుమార్ అన్నారు. మండలంలోని పురుషోత్తపురంలో కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాఖ సంయుక్తంగా వికసిత కృషి సంకల్ప అభియాన్ ఖరీఫ్ సన్నద్ధతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త తమ్మినేని రాజశేఖర్, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త శైలజ, కెవికె శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.బాలకృష్ణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపు, మున్సిపల్ కార్మికులందరికీ షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అందించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మండల కన్వీనర్ రమేష్ పట్నాయక్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్రాంత బెనిఫిట్, ఎక్స్‌గ్రేషియా రూ.7 లక్షలు పెంచాలని, దహన సంస్కారాలకు రూ.15 నుంచి రూ.25 వేలు పెంచాలని అన్నారు. వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలన్నారు. అనారోగ్యం పాలైన, మృతి చెందిన స్థానాల్లో వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని, కిట్లు, భద్రతా సౌకర్యాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ వర్కర్లు

ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి
మండలంలోని గోపీనాథపురం సమీపంలో మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన లోహిత్‌రావు తన ద్విచక్ర వాహనంపై గారబంద వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. తన ద్విచక్ర వాహనం మార్గమధ్యలో మరమ్మతులకు గురైంది. దీంతో వేరొక బైక్‌తో తన ద్విచక్ర వాహనం తాడుతో కట్టి వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో లోహిత్‌రావు తలపై, కాలుకు గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

దెబ్బతిన్న కారు

లారీని ఢీకొన్న కారు

లావేరు : మండలంలోని బుడుమురు జాతీయ రహదారి విశాఖ డెయిరి కేంద్రం సమీపంలో వంతెనపై మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న లారీని అదే రహదారిపై వెనుకనుంచి వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురూ స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదం సంభవించిన వెంటనే కారులో బెలూన్లు ఓపెన్ కావడం, కారు నెమ్మదిగా రావడంతో వారు అంతా ప్రాణాలతో బయట పడ్డారు. వెనుక నుంచి మరే ఇతర వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

నిధుల మంజూరుపై హర్షం

నందిగాం : రోడ్డు మంజూరుకు కృషి చేసిన వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు శివరాంపురం సర్పంచ్ జానకిరామ్, సభ్యులు అట్టాడ సుదర్శనరావు, జనసేన నాయకులు చిరంజీవిలు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని పెంటవూరు, పొల్లాడ వరకు 9 కిలోమీటర్లకు రూ.6 కోట్లు, దొడ్లరామచంద్రాపురం నుంచి శైలాడకు రూ.110 కోట్లు, జల్లపల్లి నుంచి టెక్కలి మండలం సీతారాంపల్లి వరకు రూ.1.95 కోట్లు రౌతుపురం రైల్వే హాల్ట్ వరకు రూ.3 కోట్లు అంచనా వ్యయంతో రహదారుల నిర్మాణానికి కృషి చేశారని అన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రవివర్మ

మాదకద్రవ్యాల విక్రయాలపై తనిఖీలు

కవిటి: మాదక ద్రవ్యాలు విక్రయించినా వినియోగించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవివర్మ హెచ్చరించారు. ఈ మేరకు ఎస్‌పి ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణ, నిల్వలపై కవిటిలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని దుకాణాలు, ప్రజా సమూహాల్లో డాగ్ స్క్వాడ్ సహాయంతో అణువణువు పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా దుకాణందారులు ఇటువంటి చర్యలకు పాల్పడితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు నందిగాం మండల సమావేశం

నందిగాం : ఈ నెల 12న నందిగాం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కుమార్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సకాలంలో నాయకులు, పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలని సూచించారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఘనంగా బాలకృష్ణ జన్మదినం

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం నగరంలోని విశాఖ -ఎ కాలనీలో సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని అభిమానులతో ఆనందం పంచుకొని కేకు కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో మందికి బసవ తారకకం ఆస్పత్రి ద్వారా బాలయ్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ఈ సంర్భంగా అనారోగ్యంతో బాధ పడుతున్న టెక్కలికి చెందిన చిన్నారికి రూ.25 వేలు అందజేశారు.

యోగా దినోత్సవంపై సూచనలు

ఇచ్ఛాపురం : ఈ నెల 21న ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా హరిద్వార్ పతంజలి యోగ పీఠం స్వామి రీతాజీ మహారాజు ఇచ్ఛాపురం వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ వెంకటరావు, సిఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్ఐ ముకుందరావులను కలిసి చర్చించారు. యోగా విశేషాలు చర్చిస్తూ... కొన్ని సూచనలు చేశారు.

సిఐ, ఎస్ఐతో రీతాజీ మహారాజు

కష్టపడి పనిచేస్తే ఫలితం

విజయనగరం ఎంపీ అప్పలనాయుడు

మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ అప్పలనాయుడు

రణస్థలం రూరల్: పార్టీకి కష్టపడి పనిచేసే వారికి ఫలితం తప్పకుండా ఉంటుందని విజనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో మండల టిడిపి విస్తృత స్థాయి సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రస్తావిం చారు, తదుపరి మండల పార్టీ కార్యాచరణపై విశ్లేసించారు. మండలం పరిధిలో పలు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు. అనంతరం మండల పార్టీ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శి అభ్యర్థి ఎన్నికపై అభిప్రాయాలను స్వీకరించారు. ఎంపీ అధ్యక్షతన మండల నూతన మండల పార్టీ అధ్యక్షునిగా లంక శ్యామలరావు, ప్రధాన కార్యదర్శిగా మండపాక కనకరావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డిజిఎం ఆనందరావు, పిన్నింటి వెంకట భానోజీనాయుడు, పిషిని జగన్నాథం నాయుడు, పైడి అప్పడు దొర, పిషిని అసిరినాయుడు, రౌతు శ్రీనివాసరావు, వెలిచేటి సురేష్‌కుమార్, సతీష్‌వర్మ, విషిని హరికృష్ణ పాల్గొన్నారు.

అధికార దౌర్జన్యానికి పరాకాష్ట

వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గోవిందరావు

ప్రజాశక్తి - ఆమదాలవలస
సాక్షి పత్రిక ఆస్తుల ధ్వంసం అధికార పార్టీ దౌర్జన్యానికి పరాకాష్ట అని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టు, సాక్షి కార్యాలయాలపై చేస్తున్న దాడులు కుట్రపూరితమని మండిపడ్డారు. విశ్లేషకుడు శ్రీనివాసరావు రెస్టు దుర్మార్గపు చర్య అని తీవ్రంగా ఖండించారు. నిజాలు రాసే కలాలను వాస్తవాలు చెప్పే గొంతుని అణచివేసే దిశగా ప్రభుత్వ పాలన సాగిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ తప్పిదాలను, అరాచకాలను ప్రజల ముందుకు సాక్షి టివి తీసుకువస్తుందన్న నెపంతో ఇటువంటి చర్యలకు పాల్పడం అమానుషమన్నారు. ఒక చర్చా కార్యక్రమాన్ని సాకుగా చూపించి ఆస్తుల ధ్వంసం, అక్రమ అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారం చేపట్టి ఏడాదైనా ఒక్క హామీని అమలు చేయకపోవడంతో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత ను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలటిక్స్ చేస్తున్నారన్నారు.

రక్తదానంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న నాగోజీ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల
రక్తదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగోజి, వెంకటేశ్వర కళాశాల పరిపాలన అధికారి బి.తిరుపతిరావు అన్నారు. జిల్లా బ్లడ్ సెంటర్ ఆధ్వర్యాన ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానంపై మంగళవారం అవగాహన కల్పించారు. మాట్లాడుతూ రక్తదాత ప్రాణదాత అని అన్నారు. స్వచ్ఛంద రక్తదాతలు వల్లనే అనారోగ్యానికి గురైన వారు కోల్కొని పునర్జన్మ పొంది జీవిస్తున్నారని పేర్కొన్నారు. రక్తదాతలను గౌరవించుకోవడం మన సాంప్రదాయమన్నారు. వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి. చిట్టిబాబు మాట్లాడుతూ తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులు, దాతలు వల్లే జీవించగలుగుతున్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, ఎన్.ఉమాశంకర్ పాల్గొన్నారు.

చెరువును మింగేస్తున్న ప్లాస్టిక్ భూతం

ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన చెరువు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
ఒకప్పుడు వజ్రపుకొత్తూరుకు తాగునీటి అవసరాలు తీర్చే వజ్రం చెరువు ప్రస్తుతం దయనీయంగా మారింది. తాగునీరు మాట అటుంచితే చెరువులో కాలు పెడితే చాలు దుద్దర్లు పుడతాయని స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. వజ్రం చెరువును ప్లాస్టిక్ భూతం ఆవరించింది. ప్లాస్టిక్ వ్యర్థాలతో చెరువు పూర్తిగా నిండిపోయింది. పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఈ చెరువును డంపింగ్ యార్డుగా వినియోగిస్తున్నా పంచాయతీ పాలకవర్గం నుంచి స్పందన కరువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు వల్ల చెరువు నీరు ఆకుపచ్చ రంగులోకి మారిపోయింది. ఎంతో చరిత్ర ఉన్న వజ్రం చెరువు ప్రస్తుతం నిరుపయోగంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంశధార కాలువ ద్వారా నీరు చేరడానికి వజ్రం చెరువు శివారు పాయింట్‌గా ఉంది. అయితే ఎప్పుడూ వంశధార నీరు వచ్చిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. చెరువు గట్టుపై సుబ్రమణ్య స్వామి ఆలయం ఉంది. వజ్రం చెరువును అభివృద్ధి చేస్తే ఆలయానికి వచ్చే యాత్రికులకు సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. వజ్రం చెరువును అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకొని రావాలని స్థానికులు కోరుతున్నారు.

బాల్యవివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

పాతపట్నం : బాల్యవివాహాల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ ముందడుగు వేయాలని ఐసిడిఎస్ పిఒ సిహెచ్.ఇందిర అన్నారు. పాతపట్నం పంచాయతీ కార్యాలయంలో కిశోర వికాసం వేసవి విజ్ఞాన అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా ఉండడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సిర్ల జాగారావు, పంచాయతీ ఇఒ రామచంద్రరావు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు అనురాధ, అమరావతి పాల్గొన్నారు.

ముగిసిన వేసవికాసం

కొత్తూరు: ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యాన స్థానిక అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోర బాలికల వేసవి వికాసం కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. నెల రోజుల పాటు బాలికల విద్య, నైపుణ్యం, అభివృద్ధి, ఆరోగ్యం తదితర అంశాలపై బాలికలకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లింగాల శాంతి కుమారి అవగాహన కల్పించారు. అనంతరం కిశోర బాలికలతో పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పి.లక్ష్మి, ఎస్.ధనలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసిడిఎస్ పిఒ ఇందిర

ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి- లావేరు
మండలంలోని తాళ్లవలస పంచాయతీలో రూ.1.38 కోట్లతో తాగునీటి పథకాలు నిర్మిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత తెలిపారు. మండలంలోని తాళ్లవలస పంచాయతీ రావివలసలో తాగునీటి పథకం నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి పథకం నిర్మాణాలకు సుభద్రపురానికి రూ.56.10 లక్షలు, రావివలసకు రూ.56.10 లక్షలు, బొడ్డపాడుకు రూ.26 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావు సహాయ సహకారంతో పంచాయతీ అభివృద్ధి చెందుతుందనానరు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్, టిడిపి నాయకులు దారపురెడ్డి కూర్మారావు, చిట్టిబాబు, మోహన్, రాము పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సుజాత

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- ఆమదాలవలస
శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి, టింపని స్కూల్ ఆధ్వర్యాన బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టింపని స్కూల్ కరెస్పాండెంట్ బొడ్డేపల్లి వెంకట నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో నేత్రాలకు సంబంధించిన వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేస్తామన్నారు. శుక్లం ఆపరేషన్‌కి ఎంపికైన నిరుపేదలకు కాటారాక్ట్ శస్త్ర చికిత్స చేసి ఉచితంగా లెన్స్ అమర్చబడునని తెలిపారు. నేత్రాలపై కండ, మెల్లకన్ను కంటి శుక్లాలు నిర్వహించి 14 ఏళ్లలోపు పిల్లలకు ఆరోగ్యశ్రీ పథకంపై ఉచిత శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో శస్త్ర చికిత్సకు ఎంపికైన వారికి శంకర్ ఫౌండేషన్ బస్సులో తీసుకెళ్లి మళ్లీ తిరిగి ఇక్కడకు తిరిగి తీసుకొస్తామన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగిలిన వివరాలకు సెల్ నంబరు 9848495878ను సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా ఉత్సవాలు

తరలివచ్చిన యాత్రికులు

నందిగాం : మండలంలోని ప్రతాప విశ్వనాథపురం, మదనాపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామదేవత ఉత్సవాలతో జనసంద్రంగా మారింది. ఎటు చూసినా వాహనాలతో, మధ్యాహ్న భోజన సమయంలో గంటల తరబడి అంతరాయం ఏర్పడింది. దీంతో వచ్చి, వెళ్లిన వారు అవస్థలు పడ్డాడు. ఆదివారం నుంచి పాల పోలమ్మ, చింత పోలమ్మ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో బి.నరేంద్రకుమార్, నందిగామ తిరుపతిరావు, కోణారి రామారావు, పాలిన సాంబమూర్తి పాల్గొన్నారు.
పలాస : కాశీబుగ్గలో పెంట పోలమ్మ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఐదు రోజులు పాటు నిర్వహించిన ఈ సంబరాల్లో కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆయా వీధుల్లో సందడి వాతావరణం నెలకొంది. పెంట వీధి, డెంకి వీధి, పూజారి వీధి, హరిజన వీధి, పల్లి విధి, న్యూ కాలనీ తదితర వీధి మహిళలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు